
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

గురువారం 19 సెప్టెంబరు 2024

ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా..



రఘునాథపల్లి మండలం కోమల్లలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు (ఫైల్)

- ఈనెల 30వరకు 695కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- పోషకాహారం ప్రాధాన్యతపై మహిళలకు అవగాహన

అంగన్‌వాడీలు వేదికగా పోషణమాసానికి శ్రీకారం

జఫర్‌గడ్, సెప్టెంబరు 14 : చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యసంరక్షణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందించడంతో పాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నాయి. కానీ సరైన అవగాహన లేకపోవడం, పేదరికం కారణంగా చాలా మంది పోషకాహార లోపంతో పలు రుగ్మతల బారిన పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రతీ ఏటా సెప్టెంబరు మాసంలో సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నారు. మంచి ఆహారం తీసుకోవాల్సిన అవసరత, ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1 నుంచి 30 వరకు వివిధ శాఖల సమన్వయంతో ప్రజల భాగస్వాములను చేస్తూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషణ మాసం (పోషణ అభియాన్) పేరుతో ప్రత్యేక అవగాహన, చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తోంది. జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల, జనగామ మూడు ప్రాజెక్టుల పరిధిలోని 12 మండలాల పరిధిలో మొత్తం 695 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఈ కేంద్రాల్లో 03 - 6 ఏళ్ల లోపు ప్రీ స్కూల్ పిల్లలు 9,559 మంది, 07 -03 ఏళ్ల లోపు చిన్నారులు 13,991 మంది ఉన్నారు. అలాగే 2,554 మంది బాలింతలు, 2,712 మంది గర్భిణులున్నారు.

పిల్లల ఎదుగుదలపై పర్యవేక్షణ...
మాతా, శిశు సంరక్షణ..

నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు. వారు సరైన రీతిలో ఎదిగేందుకు ఎప్పటికపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలబాలికల ఎదుగుదలను పర్యవేక్షిస్తున్నాయి. వారికి పౌష్టికాహారం అందించడంతో పాటు వివిధ సందర్భాల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల అంగన్‌వాడీల ద్వారా గ్రోత్ మేళా నిర్వహించారు. పోషకాహార లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి.. వారి ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన తీరును వారి తల్లులకు వివరిస్తున్నారు. మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తోంది. పిల్లల సంరక్షణతో పాటు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం దిశగా కార్యక్రమాలను చేపడుతున్నారు. చిన్నారుల్లో శారీరక ఎదుగుదలలో లోపాలను నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారంతో పాటు వివిధ రకాల సేవలందిస్తోంది. గర్భిణులు, బాలింతల్లో పోషణస్థాయిని మెరుగుపరచడమే కాకుండా తల్లితో పాటు బిడ్డకు పోషకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాయి. అయినా ఇంట్లో తీసుకునే ఆహారం విషయంలో అవగాహన కొరవడుతోంది. ఇలాంటి పరిస్థితులకు స్వస్తి పలికేందుకు పోషణమాసం నిర్వహించి ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యరక్షణ, పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది. ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థలు, విద్యాలయాలు, ఆరోగ్యశాఖ, వివిధ శాఖల భాగస్వామ్యంతో ఈనెల 30 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటి వారంలో ప్రజలు, మహిళలతో మమేకమై సమావేశాలు నిర్వహించి పిల్లలకు అందించే పౌష్టికాహారంపై వివరించి అవగాహన కల్పిస్తారు. రెండో వారంలో పిల్లలకు కథలను వినిపించి మాట్లాడించి చదివించడం, ఆటపాటలతో విద్యనందించడం, రక్తహీనత గల పిల్లలు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలను గుర్తించి వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. మూడోవారంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లల బరువు, ఎత్తు కొలవడం, తక్కువ బరువు, పోషణలోపంతో బాధపడే చిన్నారులకు బాలామృతం, ప్లస్ అందజేస్తారు. పోషకాహారం, ఆరోగ్యంపై వైద్య విద్యాలయాల్లో సెమినార్లు నిర్వహిస్తారు. చివరి వారంలో తక్కువ బరువు ఉన్న పిల్లల వివరాలను పోషణ ట్రాకర్ అప్లికేషన్‌లో నమోదు చేసి ఎదుగుదలకు తీసుకోవాల్సిన, ఇంట్లో తయారు చేసుకోవాల్సిన పోషకాహారంపై తల్లులు లేదా సంరక్షకులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తారు. పర్యావరణ పరిరక్షణ కోసం తల్లి పేరుతో పూలు, పండ్లు, ఔషధ మొక్కలు నాటించడం, తల్లిదండ్రులు, మహిళా సంఘాలచే సమావేశాలు నిర్వహించడంతో పాటు ఈ పోషణమాసంలో ఇంకా పారిశుధ్య కార్యక్రమాలు, కిచెన్ గార్డెన్స్, పిల్లలకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు, వ్యాయామ, యోగా శిబిరాలు, ఆహార పంటలు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



వివిధ శాఖల అధికారులతో కలిసి పోషణమాసం ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా (ఫైల్)

పోషకాహార లోపాలను అధిగమించేందుకు చర్యలు



పిల్లల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు వివిధ దశల్లో చర్యలు తీసుకుంటున్నాం. పోషణ లోపాల పిల్లల వివరాలను ఎప్పటికపుడు నమోదు చేసుకుంటున్నాం. ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ నెల రోజుల పాటు కార్యక్రమాలు చేపడుతున్నాం. గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపం ప్రభావం పిల్లలపై పడుతోంది. వీరికి కావాల్సిన పౌష్టికా హారం ఎప్పుడు, ఏ మోతాదులో తీసుకోవాలో ప్రధానంగా తెలియజేస్తున్నాం. తల్లిదండ్రులు పోషకాహారం, ఆరోగ్య రక్షణ జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. ఇందుకోసం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో మహిళలకు, గర్భిణులకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోరబాలికలకు పోషకాహారం, ఆహారపదార్థాలు, ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశాలిచ్చాం.

- జెట్టి జయంతి, జిల్లా మహిళా శిశుసంక్షేమాధికారి, జనగామ

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలియజేయాలి

◆ మూడు దశల్లో జీపీ ఎన్నికలు ◆ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్, సెప్టెంబరు 18: గ్రామ పంచాయతీల డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో అభ్యంతరాలను ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌లతో కలిసి వివిధ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 283 గ్రామ పంచాయతీ పరిధిలో 2,576 వార్డుల్లో ఉన్నాయని ఇందులో భాగంగా 2,02,981 పురుషుల ఓటర్లు, 2,06,573 మహిళ ఓటర్లు, మొత్తం 4,09,558 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జీపీ ఎన్నికలు మూడు దశల్లో జరుగుతాయన్నారు. మొదటి దశలో నర్మెట్ట, తరిగొప్పుల, బచ్చన్నపేట, జనగామ, లింగాల ఘనపూర్, మండలాల్లో, రెండవ దశలో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల్లో, మూడో దశలో చిల్పూర్, స్టేషన్ ఘనపూర్, రఘునాథపల్లి, జాఫర్‌ఘడ్, మండలాల్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

ఓటర్ల జాబితాపై ఈ నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. 26 లోపు మార్పులు చేర్పులు చేపట్టి 28న తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో డీపీవో స్వరూప, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, నాయకులు బి. భాస్కర్, రావెల రవి, విజయ్ భాస్కర్, జోగు ప్రకాశ్, చంద్రశేఖర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలి

అడిషనల్ కలెక్టర్ పికేశ్ కుమార్



తరిగొప్పులలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

తరిగొప్పుల, సెప్టెంబరు 18: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడేందుకు అధికారులు నిరంతరం పనిచేయాలని జనగామ అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం మండల కేంద్రంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ పేరున ఓ మొక్కను నాటారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం గురించి వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బండ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం వసంత, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కారు అద్దం పగులగొట్టి..

రూ.2 లక్షల చోరీ



దుండగులు పగలగొట్టిన కారు అద్దం

జనగామ రూరల్, సెప్టెంబరు 18: పట్టపగలే రోడ్డుపై ఉన్న కారు అద్దం ధ్వంసం చేసి రూ.2 లక్షలు ఎత్తుకెళ్లిన సంఘటన జనగామలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన ఎల్లబోయిన ప్రకాశ్ సివిల్ కాంట్రాక్టరుగా పనిచేస్తూ జనగామలో నివసిస్తు న్నాడు. కాగా బుధవారం నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంటి యజమాని మహి పాల్‌రెడ్డి పని నిమిత్తం రూ.2.50 లక్షల చెక్కును ప్రకాశ్‌కు అందించాడు. ఈ చెక్కు కెనరా బ్యాంకునకు చెందినది కావడంతో హైదరాబాద్ రోడ్డులోని కెనరా బ్యాంకులో చెక్కు విత్‌డ్రా చేసుకున్నాడు. కారులో జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ)లో రూ.50 వేలు డిపాజిట్ చేయడానికి వచ్చాడు. మిగిలిన రూ.2 లక్షలు కారులో ఉన్న బ్యాగ్‌లో ఉంచి లాక్ చేసి బ్యాంకు లోపలికి వెళ్లాడు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైకుపై వచ్చి కారు అద్దం పగులగొట్టి అందులో ఉన్న రూ.2 లక్షలు ఉన్నటువంటి బ్యాగును ఎత్తుకెళ్లారు. బాధితుడు ప్రకాశ్ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు పార్టీలకతీతంగా పనిచేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మోకు కనకారెడ్డి

జనగామ రూరల్, సెప్టెంబరు 18: అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో రైతాంగ సాయుధ పోరాటం జనగామ గడ్డ నుంచి పుట్టిందని అటువంటి గడ్డపైనే రైతాంగ సాయుధ పోరాట యోధులకు అవమానం జరిగిందన్నారు. సెప్టెంబరు 17న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల కుటుంబ సభ్యులకు కనీసం సన్మానం కూడా చేయలేదని మండిపడ్డారు. కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రజాతీర్పును గౌరవించి ప్రజల్లో ఉండి పని చేయాలే తప్ప ఏ అధికార హోదా లేకుండా వేదికపై కూర్చునే అర్హత ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాపర్తి రాజు, ఇర్రి అహల్య, గోపి, జోగు ప్రకాశ్, వెంకటమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని పాలిస్తున్న గాడ్సే వారసులు!



హనుమకొండ అంబేడ్కర్ జంక్షన్‌లో జరిగిన నిరసన సభలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్, పాల్గొన్న మంత్రి పొన్నం, ఎంపీ, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు

- రాహుల్‌గాంధీపై ఉగ్రవాదుల్లా బీజేపీ, ఎన్‌డీఏ నేతల వ్యాఖ్యలు
- వారిపై మోదీ, అమిత్‌షాలు కేసులు పెట్టాలి
- రాహుల్ కుటుంబానిది త్యాగాల చరిత్ర
- ఆ కుటుంబ చరిత్రను కనుమరుగు చేసే కుట్ర
- రాహుల్ దేశ భవిష్యత్తు.. ఆయనను కాపాడుకుంటాం..
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్
- హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో బీజేపీ నేతల దిష్టిబొమ్మల దహనం

మహాత్మాగాంధీని చంపిన గాడ్సే వారసులు దేశాన్ని పరిపాలిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. త్యాగాల కుటుంబానికి చెందిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఎన్‌డీఏ నేతలు ఉగ్రవాదుల్లా అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ మేరకు హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి నిరసన, ధర్నాలో ఆయన పాల్గొన్నారు. బీజేపీ, దాని మిత్రపక్షాల నేతలు చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా వైఖరేమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఇప్పటి వరకు కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. అంటే.. ఈ వ్యాఖ్యలను వారు సమర్థిస్తున్నట్టేనా..? అని అన్నారు. రాహుల్‌గాంధీ త్యాగాల కుటుంబానికి చెందిన వారన్నారు. ఆయనను కాపాడుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ఎన్‌డీఏ నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

- హనుమకొండ సిటీ

వివరాలు : 7వ పేజీలో..

యువజనోత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 18: యువజనోత్సవాలలో భాగంగా జిల్లా స్థాయి యువ కళాకారులను ఎంపిక చేస్తున్నందున ఆసక్తి, అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి బి.వెంకట్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యం గ్రూప్, వ్యక్తిగతం, జానపద పాటలు గ్రూప్, సోలో, కవిత్వం (హిందీ/ఇంగ్లీషు), వ్యాసరచన (హిందీ/ఇంగ్లీషు), పెయింటింగ్, ఉపన్యాసం, హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు, సైన్స్ అండ్ టెక్నాలజీలో చేసిన కొత్త ప్రాజెక్టులతో ఈ నెల 25 లోగా జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో స్వయంగా లేదా డీవైఎస్‌ఓజెఎన్ ఎట్ జీ మెయిల్ డాట్ కామ్‌కు ఆన్‌లైన్‌లో లేదా 96521 97323 వాట్సాప్ నంబరులో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, అధికారులు

జనగామ రూరల్, సెప్టెంబరు 18: ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేయాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సివిల్ సప్లయ్ అధికారులను రాష్ట్ర సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రటరీ డీ.ఎస్.చౌహాన్ ఆదేశించారు. బుధవారం ధాన్యం కొనుగోలు ప్రణాళికపై చౌహాన్ హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, సివిల్ సప్లయ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలుకు కావాల్సిన గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం రాకను బట్టి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సరిపడా టార్పాలిన్‌లు, తేమ శాతాన్ని గుర్తించే మాయిశ్చర్ మిషన్లు, వెయింగ్ మిషన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ విధులు నిర్వహించే సిబ్బందికి సన్నరకం ధాన్యం గుర్తించేందుకు శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ మాట్లాడుతూ జిల్లాలో 4,74,950 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశామని, 2,05,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు 180 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. 51 లక్షల గన్నీ బ్యాగులు అవసరమైనందున ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ సమావేశంలో డీఆర్‌డీవో వసంత, డీఎస్ఎం హతీరాం, డీఎస్‌వో సరస్వతి, జిల్లా సహకార శాఖ అధికారి రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పని వేళలను శాస్త్రీయంగా నిర్వహించాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు



పెంబర్తి జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 18: గురుకుల పాఠశాలల పని వేళలు శాస్త్రీయంగా నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ గురుకుల జేఏసీ దశల వారీ నిరసనలో భాగంగా పెంబర్తిలోని జ్యోతిబాపూలే బాలుర, బాలికల, సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని గురుకుల సొసైటీల్లో ఒకే పని వేళలను నిర్ణయిస్తూ జీవో నెం.16 పేరుతో ఉత్తర్వులు జారీ చేశారని, ఈ టైంటేబుల్ శాస్త్రీయంగా లేదన్నారు. గురుకుల పాఠశాలల పని వేళలు విద్యార్థుల మానసిక వికాసానికి తగిన విధంగా ఉండాలని, ఉపాధ్యాయులు ఒత్తిడి లేకుండా పని చేసేటట్లు నిర్ణయించాలని కోరారు. పనివేళలు విద్యార్థులకు అనుగుణంగా సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, కార్యదర్శి కృష్ణ, ప్రిన్సిపాళ్లు చంద్రమౌళి, అనిత, శ్రీనివాసరావు, నర్సింహులు గౌడ్, నాగేశ్వర్‌రావు, కిషన్, వేణుమాధవరావు, కృష్ణ, అర్పిత, సునీత పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు సుందర్‌రాజ్ గుడ్ బై?

- కాంగ్రెస్ లేదా బీజేపీలో చేరే అవకాశం
- ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి పార్టీకి దూరం

రాంనగర్, సెప్టెంబరు 18: కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉం టున్న మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రా జ్ కారు దిగేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. సుందర్‌రాజ్‌తో అధికార పార్టీ కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో తన శ్రేయోభిలాషులతో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఏపార్టీలోకి వెళ్లినా సముచితస్థానం ఉంటుందనే హామీ లభించినట్లు తెలిసింది.

కాగా, 2001 నుంచి బీఆర్ఎస్‌లో పనిచేస్తున్న సుందర్ రాజ్.. 2015, 2021, 2024లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ టికెట్ ఆశించారు. పార్టీ అధిష్ఠానం సుందర్‌రాజ్‌కు ఇవ్వకుండా దాటవేస్తూ వచ్చింది. అధి ష్ఠానం నిర్ణయానికి కట్టుబడిన సుందర్‌రాజ్.. పార్టీ ఇచ్చిన కార్యకలాపాలను విజయవంతం చేశారు. ప్రతీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాస్టర్జీ కళాశాలల అధినేతగా, ప్రైవేటు కళాశాలల సంఘం రాష్ట్ర నేతగా యాజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రాడ్యుయేట్స్‌ను ఏకతాటిపై తీసుకువచ్చి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో తనదైన పాత్ర పోషించాడు. ఈ క్రమంలో సుందర్‌రాజ్‌కు బీఆర్ఎస్ అధిష్ఠానం 2022 ఏప్రిల్ 4వ తేదీన కుడా చైర్మన్‌గా అవకాశం కల్పించింది. అయితే ఆయన ఈ పదవిలో కనీసం యేడాది కూడా ఉండ లేదు. కిందటేడు నవంబర్‌లో జరిగినఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కుడా చైర్మన్ పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. 8 నెలలు మాత్రమే కుడా చైర్మన్‌గా పదవిలో సుందర్‌రాజ్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో..

కుడా చైర్మన్ పదవి కోల్పోయిన క్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్‌ను సుందర్‌రాజ్ ఆశించారు. అయితే బీజేపీని వీడి బీఆర్ఎస్‌లోకి వచ్చిన రాకేష్‌రెడ్డికి అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. రాకేష్‌రెడ్డిని తీసుకురావడంలో బీఆర్ఎస్‌కు చెందిన ఒక ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. తనకు అవకాశం ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన సుందర్‌రాజ్.. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో అమెరికా వెళ్లారు. తిరిగి వచ్చి ఐదు మాసాలుగా పార్టీ కార్య కలాపాలకు దూరంగా ఉంటున్నారు. నూతనంగా బీసీ సం ఘాన్ని ఏర్పాటు చేసి సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నా రు. పార్టీకి దూరమైన సుందర్‌రాజ్‌ను పార్టీ నేతలు పలకరించిన పాపాన పోలేదని తెలిసింది. ప్రతీ పార్టీ కార్యక్ర మంలో కీలక పాత్ర పోషించే ఆయన.. దూరంగా ఉండటం పట్ల స్థానిక నేతలు సైతం స్పందించలేదని సమాచారం. అటు అధిష్ఠానం, ఇటు స్థానిక నేతలు పట్టించుకోకపోవ డంతో సుందర్‌రాజ్ పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. సుందర్‌రాజ్ బీఆర్ఎస్ వీడితే పట్టబద్రులు దూరమయ్యే అవకాశం ఉందని శ్రేణులు చర్చించుకుంటున్నారు.



వర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబుపై వేటుకు రంగం సిద్ధం!

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ భూ కబ్జాల ఆరోపణల నేపథ్యంలో తొలుత సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబుపై వేటు పడనున్నట్లు తెలిసింది. వర్సిటీ భూ కబ్జాల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి జాయింట్ ఇన్‌స్పెక్షన్ బృందం అధికారులు చేసిన సిఫార్సుల మేరకు కఠిన చర్యలకు రంగం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. వర్సిటీలోని 229 సర్వే నెంబర్‌లో అశోక్‌బాబు తోపాటు మరికొందరు అక్రమంగా ఇళ్లు నిర్మించడమే కాకుండా కబ్జాలకు పాల్పడినట్లు తాజాగా తేలిదిఇ. సర్వేల ఆధారంగా వర్సిటీ 229 సర్వేనెంబర్‌లో భూకబ్జాలపై స్పష్టత రావడంతో జిల్లా రెవెన్యూ అధికారులు రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలిసింది. రెవెన్యూ, విజిలెన్స్ అధికారుల సర్వే రిపోర్టుల ఆధారంగా ఏఆర్ పి.అశోక్‌బాబుపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని వర్సిటీలో జోరుగా చర్చ నడుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశమున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

కాగా, వర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ విభాగంలో ఏఆర్‌గా పనిచేసిన కాలంలో ఏఆర్ అశోక్‌బాబు వర్సిటీ పాలక మండలిలో, వర్సిటీ భూ కమిటీలో సభ్యుడిగా, కన్వీనర్‌గా పనిచేశారు. అయితే అశోక్‌బాబు పాలక మండలిలో, భూకమిటీ నుంచి తొలగించాలని పాలక మండలి సభ్యులు, రాష్ట్ర ఉన్నతాధికారులు కోరినప్పటికీ అప్పటి వీసీ టి.రమేశ్ తొలగించకుండా కొనసాగించారు. విద్యార్థిసంఘాల ఆందోళనలు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూకమిటీని నుంచి చివరకు అశోక్‌బాబును తొలగించాల్సి వచ్చింది. అయితే ఆ సమయంలో అశోక్‌బాబుపై చాలా ఆరోపణలు వచ్చాయి. అనుకూలమైనవారికి వర్సిటీలో అత్యున్నత పదవులు కట్టబెట్టబెట్టడంలో సహకరించారని, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల పట్ల సరిగా వ్యవరించేవారు కాదనే ఆరోపణలున్నాయి. తనకు వత్తాసు పలికిన వారికి పార్టుటైమ్ ఉద్యోగాలు కట్టబెట్టినట్లు తెలిసింది. అలాగే వర్సిటీలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

దేశాన్ని పాలిస్తున్న గాడ్సే వారసులు!

● ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఉగ్రవాదుల్లా బీజేపీ, ఎన్డీఏ నేతల వ్యాఖ్యలు ● వారిపై మోదీ, అమిత్‌షా కేసులు పెట్టాలి
● టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ● హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో బీజేపీ నేతల దిష్టిబొమ్మల దహనం

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 18: భారతదేశాన్ని గాడ్సే వారసులు పాలిస్తున్నారని, ప్రజాస్వామ్య విలువలను పాతిపెడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీపై బీజేపీ, ఆ పార్టీ మిత్రపక్షాల నేతలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్‌లో రాహుల్‌గాంధీపై బీజేపీ, ఎన్‌డీఏ నేతలు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్నా, నిరసన సభ జరిగింది. బీజేపీ మంత్రి రవనీత్‌సింగ్ బిట్టు, శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌ల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. అనంతరం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభను ఉద్దేశించి మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు.



అంబేద్కర్ జంక్షన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, పక్కన ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు

బీజేపీకి చెందిన రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్, శివసేన పార్టీ ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, యూపీ మంత్రి రఘురాజ్‌సింగ్, బీజేపీ నాయకుడు దర్విందర్ సింగ్‌లు తీవ్రవాదుల్లా మాట్లాడారని మండిపడ్డారు. బాధ్యతగల ప్రజాప్రతినిధులై ఉండి మరో ప్రజాప్రతినిధి అయిన రాహుల్‌గాంధీపై అప్రజాస్వామికంగా, తీవ్రవాదుల్లా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పునరుద్ఘాటించారు. బీజేపీ, దాని మిత్రపక్షాల నేతల వ్యాఖ్యలపై ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే స్పందించాలని, ఆ నలుగురి వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా? లేక వ్యతిరేకిస్తున్నారా? తేలాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం, గౌరవం ఉంటే.. ప్రధానమంత్రి ఆ నలుగురిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే అప్రజాస్వామికులను గౌరవిస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

రాహుల్‌గాంధీ కుటుంబానికి త్యాగాల చరిత్ర

రాహుల్‌గాంధీ కుటుంబానికి త్యాగాల చరిత్ర అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మోతీలాల్ నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వరకు దేశం కోసం త్యాగాలు చేశారని, జైలుకు వెళ్లారన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలే అర్పించారన్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని దేశ ఐక్యత, అభివృద్ధి కోసం తపిస్తున్న రాహుల్‌గాంధీని ఒకరు టెర్రరిస్టు అని, మరొకరు ఆయన నాలుక కోస్తే వాళ్లకు రూ.11లక్షల బహుమానం ఇస్తామని, ఇంకొకరు రాహుల్‌గాంధీకి వాళ్ల నాయనమ్మకు పట్టిన గతే పడుతుంది.. అంటూ భయానక వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలంతా ఖండిస్తున్నారన్నారు. అయినా మోదీ, అమిత్‌షాలు మాత్రం నోరు మెదపడం లేదని విరుచుకుపడ్డారు. జమ్మూ కశ్మీర్, మహారాష్ట్రల్లో బీజేపీ, శివసేన కనుమరుగు కానుందని, రానున్నరోజుల్లో హరియానాలో కాంగ్రెస్ అధికారంలోకి రానుందందని, దీనిని జీర్ణించుకోలేని బీజేపీ.. రాహుల్‌గాంధీపై అప్రజాస్వామిక వ్యాఖ్యలు చేస్తూ బెదిరింపులకు గురి చేస్తోందని ఆరోపించారు. రాహుల్.. ఆయన కుటుంబ చరిత్రను కనుమరుగు చేయాలనే కుట్రలు బీజేపీ పన్నుతోందన్నారు. రాహుల్‌కు ఏమైనా హాని జరిగితే బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రాహుల్‌గాంధీ దేశ ప్రజల భవిష్యత్తు అని, ఆయనను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. బీజేపీ నేతల వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ మౌనంగా ఉందని, బీజేపీతో ఆ పార్టీ లోపాయికారి ఒప్పందమే ఇందుకు నిదర్శనమని మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. దేశంలో కుల, మత వైషమ్యాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలనే బీజేపీకి ప్రజలే మరింత గుణపాఠం చెబుతారన్నారు. మోదీ, అమిత్‌షాలకు చిత్తశుద్ధి ఉంటే ఇకనైనా ఆ నలుగురిపై కేసులు నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించాలి

రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆ నలుగురిపై బీజేపీ అధిష్ఠాన వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, ముఖ్యంగా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు స్పందించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీజేపీ అడుగులకు మడుగులు ఒత్తే బీఆర్‌ఎస్ నేతలు కిమ్మనడం లేదని దుయ్యబట్టారు. ప్రధాన మంత్రి మోదీ, ఆయన తల్లిపై వ్యాఖ్యలు చేయాలనుకుంటే తాము చేయలేమా?.. అది సంస్కారం కాదని మంత్రి పొన్నం వ్యాఖ్యానించారు.

గాంధీ కుటుంబం కాలి గోటికి సరిపోరు

బీజేపీ నేతలు రాహుల్‌గాంధీ కుటుంబం కాలి గోటికి సరిపోరని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ త్యాగాలు ముందు బీజేపీ నేతలెంత? అని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ సారయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీపై ఈగ వాలినా ఊరుకోమని హెచ్చరించారు. దేశంలో వైషమ్యాలు, ద్వేషాలు సమసి అన్నివర్గాల ప్రజలు సుఖః సంతోషాలతో విలసిల్లాని, దేశం అభివృద్ధి చెందుతూ ఐక్యంగా ఉండాలని రాహుల్‌గాంధీ కోరుకుంటుంటే.. బీజేపీ నేతలు ప్రజాస్వామ్య విలువలను పాతర పెట్టేలా వ్యవహరిస్తున్నారని విరుచుకుపడ్డారు. రాహుల్‌గాంధీ రాజకీయ ఉన్నతిని జీర్ణించుకోలేకే బీజేపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసాచారి, ఆనంద్ మోజెస్, జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్ రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, టీపీసీసీ నాయకులు శ్రీనివాసాచారి, కూచన రవళి, ఎం.డి. అంకూస్, మార్క విజయ్, ఆనంద్ మోజెస్, డాక్టర్ శ్రవణ్, వీసం సురేందర్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, రజాలీ, బుచ్చిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



ప్రసంగిస్తున్న భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు



ప్రసంగిస్తున్న మేయర్ గుండు సుధారాణి



మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

ఊకల్ నాగేంద్రస్వామి, భద్రకాళి సన్నిధిలో..

వరంగల్ కల్చరల్ / గీసుగొండ, సెప్టెంబరు 18: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బొమ్మగాని మహేష్‌కుమార్ గౌడ్ బుధవారం తొలిసారి వరంగల్ పర్యటనకొచ్చారు. తొలుత ఆయన గీసుగొండ మండలం ఊకల్ గ్రామంలోని శ్రీబాల నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే 40 రోజులుగా విజయ పాశుపత పారాయణం జపించిన ఆయన రక్ష కంకణాన్ని స్వామి వారికి తిరిగి చెల్లించారు. ఈ సందర్భంగా సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు మహేష్‌కుమార్ గౌడ్‌కు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. నెమలి పింఛాలమాలతో సత్కరించారు.

అనంతరం వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయానికి చేరుకున్న మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అక్కడ వల్లభగణపతిని దర్శించుకున్న తర్వాత భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయ మహా మండపంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, పుల్లా పద్మావతి తదితరులకు అర్చకులు శేషు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో శేషు భారతి అమ్మవారి శేష వస్త్రాలు, చిత్రపటాలను బహూకరించారు. అనంతరం ఆలయం వెలుపల పీసీసీ అధ్యక్షుడు మీడియాతో మాట్లాడుతూ తాను కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, గోపాల నవీన్‌రాజు, శ్రీనివాస్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఊకల్ ఆలయంలో పీసీసీ అధ్యక్షుడి వెంట మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలతో పాటు పార్టీ గీసుగొండ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, అధికార ప్రతినిధులు చాడా కొమురారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, కందకట్ల కళావతి, హైకోర్టు అడ్వకేట్ తీగల రాజేష్‌గౌడ్, ఏసీపీ తిరుపతి, సీఐ నాగరాజు, ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, కొత్తగట్టు రాజేందర్, నాయకులు కూసం రమేష్, కందకట్ల నరహరి, నాగరాజు, మాజీ సర్పంచ్ నాగదేవత, వీరారావు తదితరులు పాల్గొన్నారు.



టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భద్రకాళి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేస్తున్న ఈవో, అర్చకులు



ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో మహేష్‌కుమార్‌గౌడ్, పొన్నంకు ప్రసాదం అందిస్తున్న అర్చకులు సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు

పీసీసీ చీఫ్‌కు ఘన స్వాగతం

టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా హనుమకొండకు వచ్చిన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మడికొండలో ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. నిరసన అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్న భోజనం చేశారు. అక్కడి నుంచి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు జమ్మికుంటకు బయలుదేరారు.



వైద్య కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ప్రారంభానికి సిద్ధమైన నర్సంపేట వైద్య కళాశాల భవనం

నేడు నర్సంపేట వైద్య కళాశాల ప్రారంభోత్సవం

హాజరవనున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నర్సంపేట, సెప్టెంబరు 18: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ శివారులో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల భవనాన్ని గురువారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులు, వైద్యులతో కలిసి బుధవారం పరిశీలించారు. వైద్య కళాశాల భవనంలో ఏర్పాట్లను, వివిధ విభాగాలకు చెందిన గదులను వారు పరిశీలించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరెడ్డి, కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. మెడికల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం 50మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చేరడానికి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అనుమతిచ్చింది. ఇప్పటి వరకు 50 మందిలో ఏడుగురు నాన్ లోకల్ విద్యార్థులకు అడ్మిషన్లు పొందే అవకాశం కల్పించగా, నాన్ లోకల్‌కు చెందిన ఒక విద్యార్థి మాత్రమే అడ్మిషన్ పొందారు. మరో ఆరుగురు నాన్ లోకల్, 43 మంది లోకల్ విద్యార్థులు అడ్మిషన్లు పొందాల్సి ఉంది. ఈనెల చివరి వరకు అడ్మిషన్లు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

జర్నలిస్టు హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్‌గా వల్లాల రమణ



బాలసముద్రం, సెప్టెంబరు 18: జర్నలిస్టు హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్‌గా వల్లాల రమణను బుధవారం ఐజేయూ అనుబంధ సంఘం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ ప్రకటించారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన వల్లాల రమణ.. మూడు దశాబ్ధాలకు పైగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. జర్నలిస్టు సంఘంలో గతంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులుగా, సంయుక్త కార్యదర్శిగా, నాలుగుసార్లు ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా రమణ పని చేశారు. ప్రస్తుతం రమణ మన తెలంగాణ దిన పత్రికా ప్రత్యేక ప్రతినిధిగా కొనసాగుతున్నారు. కాగా, తనను రాష్ట్ర కన్వీనర్‌గా నియమించడం పట్ల మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, ఇతర యూనియన్ నాయకులకు రమణ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని పేర్కొన్నారు. యూనియన్ నాయకుల సహకారంతో జర్నలిస్టుల హౌసింగ్ సంక్షేమానికి పాటుపడుతానని అన్నారు. కాగా, ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన రమణకు వివిధ సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులపై ఇన్‌చార్జ్ వీసీ కరుణ సీరియస్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కేయూ తెలుగు విభాగంలో ఆర్ట్స్ డీన్, విభాగాధిపతి ప్రొఫెసర్ ఏటూరు జ్యోతిని అవమానకరంగా మాట్లాడటంతో పాటు మానసికంగా ఇబ్బందులకు గురి చేసిన తెలుగు విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు కర్రె సదాశివ్‌తో పాటు మరో కాంట్రాక్టు అధ్యాపకుడిపై కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రొఫెసర్ జ్యోతి ఫిర్యాదు మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ కాంట్రాక్టు అధ్యాపకుల సస్పెన్షన్‌కే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా, సదరు కాంట్రాక్టు అధ్యాపకులు ప్రొఫెసర్ ఏటూరు జ్యోతికి క్షమాపణలు చెప్పడంతో పాటు మరోసారి ఎలాంటి తప్పిదాలకు పాల్పడమని లేఖ రాసిచ్చారు.

జర్మనీలో ఉద్యోగాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18: జర్మనీ దేశంలో వివిధ రంగాల్లోని ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఎప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం. మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెని లిమిటెడ్ (టామ్‌కాం) ఆధ్వర్యంలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. లాజిస్టిక్స్, టెక్నికల్, హాస్పిటాలిటీ, ఫుడ్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఉద్యోగాల ఉన్నాయని, 28 సంవత్సరాల వయస్సులోపు గల వారు టామ్‌కామ్ వెబ్‌పోర్టల్ లేదా యాప్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. అన్ని వివరాల కోసం టామ్‌కామ్ వెబ్‌పోర్టల్‌ను లేదా 8125251408/9100798204లో సంప్రదించాలని సూచించారు.

చరిత్ర ఘనం.. శిథిల జ్ఞాపకం..

ములుగు మండలం కొత్తూరు దేవునిగుట్టపై పురాతన ఆలయం
1500ఏళ్లనాటిదిగా భావిస్తున్న పురావస్తు పరిశోధకులు
'ఫారెస్టు' టూరిజానికి మొదటి అడుగు
రాళ్లతో మెట్ల మార్గాన్ని నిర్మిస్తున్న అటవీశాఖ
ట్రెక్కింగ్, క్యాంప్ ఫైర్ నిర్వహణకు సన్నాహాలు



ఆలయాన్ని పరిశీలిస్తున్న జర్మనీ పరిశోధకురాలు కొరీనా (ఫైల్)

ములుగు, సెప్టెంబరు 18: ములుగు అభయారణ్య గర్భం వందల ఏళ్ల చరిత్రను పదిలంగా దాచుకుంది. ఎక్కడ తడిమి చూసినా.. తవ్వి శోధించినా అడుగడుగునా విస్తుగొలిపే వింతలు, విశేషాలే కనిపిస్తాయి. ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపుతో కీర్తిపొందిన రామప్ప దేవాలయం కంటే పురాతనమైన చరిత్ర సాక్ష్యాలు అనేకం శిథిల జ్ఞాపకాలుగా ఉన్నాయి. తాడ్వాయి మండలంలోని దామెరవాయి, మంగపేట మండలంలోని మల్లూరు అడవుల్లో వెలుగుచూసిన డోల్మన్ సమాధులు ఆదిమ మానవుడి ఆనవాళ్లకు దారి చూపిస్తాయి. ఇదే తరహాలో అత్యంత విశిష్టమైన రాతి నిర్మాణమొకటి ములుగు మండలం కొత్తూరు సమీపంలోని దేవునిగుట్టపై ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ దేవాలయంగా ప్రసిద్ధిగాంచిన కంబోడియాలోని ఆంగ్‌కోర్ వాట్ నిర్మాణ శైలిలో ఉండే ఈ ఆలయం ప్రస్తుతం శిథిలావస్థలో దర్శనమిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా ఈ కట్టడంపై విస్తృత పరిశోధనలు జరుగుతుండగా పరిరక్షణ, పునరుద్ధరణకు అడుగులు ముందుకు సాగడంలేదు. తాజాగా అటవీశాఖ ఆధ్వర్యంలో గుట్టపైకి మెట్ల మార్గాన్ని నిర్మిస్తుండటం ఈ ఆలయ మనుగడపై ఆశలు పెంచుతోంది.

ఆరో శతాబ్దం నాటి నిర్మాణం..

ములుగు జిల్లాకేంద్రానికి 18కిలోమీటర్ల దూరంలోని కొత్తూరు గ్రామ శివారులోగల దేవునిగుట్టపై ఈ రాతి నిర్మాణం ఉంది. వందేళ్లక్రితమే ఈ ఆలయం వెలుగులోకి వచ్చినా చుట్టూ ఉన్న దట్టమైన అడవిలో క్రూరమృగాల సంచారం ఎక్కువగా ఉండటంతో ప్రజలెవరూ అటువైపునకు వెళ్లేవారు కాదు. అయితే గత మూడు దశాబ్దాలుగా దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. గత పదేళ్ల కాలంలో దేశ విదేశాలకు చెందిన పురావస్తు, చరిత్ర పరిశోధకులు వచ్చివెళ్లారు. చూసిన వారంతా ఒకింత సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు. అంగ్‌కోర్ వాట్ ఆలయం నమూనాలో ఉండటాన్ని గుర్తించి.. 6, 7శతాబ్దాల కాలంలో నిర్మించి ఉంటారని, విష్ణుకుండినుల కాలంలోని శైలిని పోలి ఉందని అభిప్రాయపడ్డారు. దక్షిణ ఆసియాలోని పురాతన కట్టడాలపై పరిశోధన చేస్తున్న బ్రిటన్‌కు చెందిన చరిత్రకారుడు ఆడమ్ హార్డీ, జర్మనీకి చెందిన కొరీనా, ఇటలీకి చెందిన ఆండ్రీతోపాటు దేశీయ పరిశోధకులు అనేకమంది దేవునిగుట్ట ఆలయాన్ని సందర్శించి చరిత్ర లోతుల్లో అన్వేషించారు. యావత్ భారత దేశంలోనే ఇలాంటి నిర్మాణం ఎక్కడాలేదని తేల్చిచెప్పారు. ఫొటోలు, వీడియోలు తీసుకొని వెళ్లి ఇంకా అధ్యయనం జరుపుతూనే ఉన్నారు.



స్థానికులతో కలిసి ఆలయాన్ని సందర్శించిన బ్రిటన్‌కు చెందిన చరిత్రకారుడు ఆడమ్ హార్డీ

శిథిలావస్థలో ఆలయం

దేవునిగుట్ట ఆలయం నిర్మాణం చూడగానే మనసును కట్టి పడేస్తుంది. ఆ శైలి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. 30మీటర్ల ఎత్తులో ఉండే ఈ ఆలయం రాతి ఇటుకలను పేర్చినట్లు కనిపిస్తుంది. శైవం, వైష్ణవం కలబోతగా శిల్పాకృతులున్నాయి. తాండవం చేస్తున్నట్లుగా పరమశివుడు, నిలువెత్తు విష్ణుమూర్తి, దేవతల ఆకృతులు కనిపిస్తాయి. అనేక రాళ్లపై దేవతామూర్తుల రూపాన్ని చెక్కి వరుసక్రమంలో పేర్చిన తీరు ఆనాటి మేధస్సుకు అద్దం పడుతోంది. కాలక్రమంలో ఆలయం శిథిలావస్థకు చేరగా.. గోపురం పైభాగం ధ్వంసమై వర్షపునీరు లోపలికి చేరుతోంది. చెట్లు పెరగడం, తీగలు అల్లుకోవడంతో రాళ్లమధ్య పగుళ్లు వచ్చాయి. 60 నుంచి 70ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రహరీ ధ్వంసమైంది. ఆలయానికి వెళ్లే మార్గంలో గండశిలపై ఉన్న కోనేరు కాలాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ నీటితో నిండి ఉంటుంది. ఇదిలా ఉంటే గుప్తనిధుల కోసం ఇక్కడ అన్వేషణ సాగుతోంది. గతంలో అనేక మంది రహస్యంగా తవ్వకాలు జరిపినట్లు స్థానికులు చెబుతారు. అయితే ఇటీవల ఆలయానికి సందర్శకులు వస్తుండటం, జనసంచారం పెరుగుతుండటంతో కొంతమేరకు తగ్గుముఖం పట్టినట్లు స్పష్టమవుతోంది.

సంరక్షిస్తున్న స్థానికులు

కొత్తూరు గ్రామస్థుల ఆరాధ్య దైవమైన లక్ష్మీనర్సింహ స్వామి తమను ప్రకృతి విపత్తులు, వైపరీత్యాల నుంచి కాపాడుతున్నాడని నమ్ముతున్నారు. దేవునిగుట్టపై సాక్షాత్తు నర్సింహస్వామియే కొలువున్నాడనే విశ్వాసంతో వారు 2012లో దేవుని విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొని ఏటా హోలీ సమ యంలో వేడుకలు జరుపుతూ లక్ష్మీనర్సింహస్వామికి కల్యా ణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చి దేవున్ని దర్శించుకుంటారు. ఈక్రమంలో భక్తులు వింత ఆచారాన్ని పాటిస్తున్నారు. వర్షాలు కురవాలని, అంటువ్యాధులు దూరం కావాలని వేడుకుంటూ వరదపాశం వేడుక నిర్వహిస్తున్నారు. బెల్లం, బియ్యం, పాలతో వండిన పరమాన్నాన్ని ఆలయం ఎదుట బండరా యిపై పోసి నాకుతారు. ఇలా ఇన్నేళ్లుగా కొత్తూరువాసులు ఈ పురాతన కట్టడాన్ని సంరక్షిస్తున్నారు. గుడి వద్దకు వెళ్లాలంటే కాలినడకన దట్టమైన తుప్పలు, చెట్లను దాటాలి. ప్రతీ ఏటా ఉత్సవాల సమయంలో అప్పటికప్పుడు ముళ్లపొదలు, తుప్పలను కొంతమేరకు తొలగించి తాత్కాలిక దారిని ఏర్పాటు చేసుకుంటారు.

రూ.10లక్షలతో మెట్లు, బెంచీలు..

ఆలయ పునరుద్ధరణ కోసం రెండేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ కృష్ణఆదిత్య రూ.1.80కోట్లను కేటాయించారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, తెలంగాణ పురావస్తు శాఖ సంయుక్త పర్యవేక్షణలో పనులు చేయాలని నిర్ణయించారు. అయితే ఆ ప్రయత్నం టెండర్ల దశలోనే నిలిచిపోయింది. తాజాగా జిల్లా అటవీశాఖ అడుగు ముందుకు వేసింది. బొగత, లక్నవరం, తరహాలో దేవునిగుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. దారి, సదుపాయాల కల్పనకోసం రూ.10లక్షల వ్యయంతో పనులు మొదలుపెట్టారు. 2కిలోమీటర్ల మేర మెట్ల మార్గాన్ని నిర్మిస్తున్నారు. స్థానికంగా లభించే రాళ్లతోనే మెట్లను కడుతున్నారు. గుట్టపై పగోడాలు, సందర్శకులు సేదతీరేందుకు బెంచీలను ఏర్పాటు చేయనున్నట్లు ములుగు ఫారెస్టు రేంజ్ అధికారి శంకర్ తెలిపారు. వారాంతాల్లో ట్రెక్కింగ్, క్యాంప్ ఫైర్, తదితర సదుపాయాలు కూడా కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. దేవునిగుట్ట విశేషాలను పర్యాటకులకు తెలిపేందుకు గైడ్‌ను నియమిస్తామని తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత నిర్ణీత టిక్కెట్ ధరతో సందర్శనకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.



మెట్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు



కొండాపూర్‌లో మాట్లాడుతున్న డీఈ గడ్డం గణేశ్

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ ట్రాన్స్‌కో డీఈ గణేశ్

చిలుపూర్, సెప్టెంబరు 18 : గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టనున్నట్లు స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ ట్రాన్స్‌కో డీఈ గడ్డం గణేశ్ స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని కొండాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించిన మరమ్మతులు చేపట్టిన ఎస్ఎస్ 10 ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు పనులను పరిశీలించారు. అనంతరం పలువురు రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈ గణేశ్ మాట్లాడుతూ సాంకేతిక సమస్యల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు ఆలస్యమైన మాట వాస్తవమేనన్నారు. మరోసారి పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు. లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. రైతులు సహకరించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు కొండాపూర్‌లో ఏర్పాటు చేయనున్న సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం త్వరలోనే స్థల పరిశీలన చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వంశీ, ఏఈ రమేష్, గడ్డం సిద్దయ్య, గ్రామస్థులు దేవేందర్, రాజయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తడి పునర్నిర్మాణానికి సత్వర చర్యలు

ఐబీ ఎస్ఈ సుధీర్



మల్కాపూర్ పెద్ద చెరువు గేట్లను పరిశీలిస్తున్న ఐబీ ఎస్ఈ

చిలుపూర్, సెప్టెంబరు 18: మండలంలోని మల్కాపూర్‌లో దెబ్బతిన్న పెద్ద చెరువు మత్తడితో పాటు, తూముల పునర్నిర్మాణ పనులకు సత్వర చర్యలు చేపట్టనున్నట్లు ఐబీ ఎస్ఈ సుధీర్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఈఈ, డీఈలు వినయ్‌బాబు, సంపత్‌కుమార్‌లతో కలిసి మల్కాపూర్ గ్రామాన్ని సందర్శించారు. దెబ్బతిన్న తూములతో పాటు, మత్తడిని పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ, తూములు, గేట్లు, మత్తడిల పునర్నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ అభిరాం, గ్రామస్థులు అలుగు అశోక్, పోలేపల్లి రవికాంత్‌రెడ్డి, చొప్పరి రాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

నర్మెట, సెప్టెంబరు 18: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 8 వేల కోట్లు స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి యకన్నారాథోడ్, మండల నాయకులు ముఖేష్, ప్రవీణ్, అఖిల, హారిక, రిషి, దీప్తి, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రాక

జనగామ కల్చరల్, సెప్టెంబరు 18: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ నేడు (19న) జనగామకు రానున్నట్లు వాసవీ క్లబ్ గ్రేటర్ ప్రతినిధి గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ సహృద్భావ పర్యటనలో భాగంగా గురువారం ఉదయం స్థానిక కోమటిరెడ్డి సుశీలమ్మ వృద్ధాశ్రమంలో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలిపారు.

బీజేపీ నేతల దిష్టిబొమ్మ దహనం

రాహుల్‌గాంధీపై వ్యాఖ్యలకు భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు



జనగామలో బీజేపీ నేతల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 18: కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్ ప్రధాన పతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ మాజీ ఎమ్మెల్యే తన్వీందర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాలమేరకు కొమ్మూరి వర్గం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేసి తన్వీందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి మాట్లాడుతూ తన్వీందర్ సింగ్ రాహుల్‌గాంధీ బయటకు వస్తే చంపేస్తామని, ఇందిరా గాంధీకి పట్టిన గతి పట్టుతుందని బహిరంగంగా మాట్లాడినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో చెంచారపు బుచ్చిరెడ్డి, శివరాజ్ యాదవ్, బడికే ఇందిరా, వంగాల కళ్యాణి, వంగాల మల్లారెడ్డి, గాదేపాక రాంచందర్, మేడ శ్రీను, మంత్రి శ్రీశైలం పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గానిపాక మహేందర్ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద కేంద్ర ప్రభుత్వ, తన్వీందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్దయ్యలు సర్వాల నరసింహరావు, ఎర్రమల్ల సుధాకర్, కంచ రాములు, చింతకింది మల్లేష్, చిర్ర సత్యనారాయణ రెడ్డి, కోన్నే మహేందర్‌రెడ్డి, మల్లేశ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

● బచ్చన్నపేట: మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు బీజేపీ నేత దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్‌గాంధీపై చేసిన వ్యాఖ్యల పట్ల ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిషాతో సహా ప్రభుత్వ పెద్దలు ఖండించకపోవటం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో నల్లగోని బాలకిషన్ గౌడ్, రవీందర్‌రెడ్డి, మహత్మాచారి, మసూద్, గుర్రపు బాల్‌రాజు, గాలి కృష్ణ, ఆముదాల మల్లారెడ్డి, డిడిగ రమేష్, నీల రమేష్, ఎల్లయ్యలు పాల్గొన్నారు.

● దేవరుప్పుల: మండలకేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, తన్వీందర్ సింగ్‌ల దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ, విజయ డైరీ జనగామ జిల్లా అధ్యక్షులు కాసారపు ధర్మారెడ్డి, నాయకులు సురేష్‌బాబు, దశరథ, యాకస్వామి, గణేష్ పాల్గొన్నారు.

● కొడకండ్ల: మండలకేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మసురం రవీందర్, పసునూరి మధుసూదన్, మనోహర్, ధర్మారం భిక్షపతి, యాకేష్, సోమశేఖర్ పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

డీఆర్‌డీవో ఏపీడీ చంద్రశేఖర్‌రావు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పాల్గొన్న చంద్రశేఖర్‌రావు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 18: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలకు బాధ్యులకు జరిమానాలను విధించి అమౌంట్‌ను రికవరి చేస్తామని డీఆర్‌డీవో ఏపీడీ చంద్రశేఖర్‌రావు తెలిపారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం అవరణలో నిర్వహించిన 16వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఏపీడీ పాల్గొన్నారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు గ్రామాల వారీగా జరిగిన ఉపాధిహామీ పనులపై సెప్టెంబరు 3 నుంచి సెప్టెంబరు 17వరకు సోషల్ అడిట్‌ను వీఆర్‌పీలు, డీఆర్‌పీల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీంతో పాటు గ్రామాల వారీగా ఉపాధిహామీ పనుల సోషల్ అడిట్ పైన గ్రామసభలను సైతం నిర్వహించి సంబంధిత అధికారులు నివేదికలు రూపొందించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన అవకతవకల విషయమై బాధ్యులపై నింబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది మేట్ నుంచి ఏపీవో వరకు పనులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ గంగరాజు, ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగ రావు, ఎస్ఆర్‌పీ గంగరాజు, జిల్లా విజులెన్స్ అధికారి రాజు, క్వాలిటి కంట్రోల్ అధికారి రాజవర్ధన్ రెడ్డి, డీఆర్‌పీ జివన్, ఏపీవో ప్రేమయ్య, సింగపురం కిరణ్‌కుమార్, టీఏలు జాంబ, సునీత, ఎఫ్ఏలు మందపురం కవిత-ఎల్లాగౌడ్, భాస్కర్, యాదగిరి, తిరుమల, మాదురి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

జనగామ కల్చరల్, సెప్టెంబరు 18: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపికలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సాఫ్ట్‌బాల్ విభాగంలో కె.సందీప్‌కుమార్, ఎంపీసీ సెకండ్ ఇయర్, బి.రాంచరణ్, బైపీసీ సెకండియర్, అదేవిధంగా అథ్లెటిక్స్ 5వేల మీటర్ల విభాగంలో జి.రాంచరణ్ ఎంపీసీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల పీడీ ఎ.కిషన్ తెలిపారు. కాగా ఎంపికైన విద్యార్థులతోపాటు వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పీడీని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాళ్లు నర్సింహులు గౌడ్, నాగేశ్వర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.వేణు అభినందించారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జనగామలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 19 విభాగం డిస్కస్ త్రోలో ఏ.శేఖర్ బైపీసీ (ద్వితీయ సంవత్సరం) ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. ఈ నెల 19న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొననున్నాడు. అలాగే సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో టెన్త్ విద్యార్థి బి.ప్రజ్వీత్ ప్రతిభ చూపాడని ప్రిన్సిపాల్ కె.కృతమూర్తి, పీడీ జి. శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వారు బుధవారం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, జయధర్, పీఈటీలు కె.లక్ష్మణ్, క్రీడల జిల్లా కార్యదర్శులు మనోజ్ కుమార్, భగత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడియం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 18: గత పదేళ్లుగా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న తమ సమస్యను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిష్కారం చూపాడని ఆయన రుణం తీర్చుకోలేనిదని స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రం రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతగా స్టేషన్‌ఘన్‌పూర్ దేవాదుల కుడితూము వద్ద కడియం చిత్ర పటానికి రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తైన తరువాత రిజర్వాయర్ కుడితూము ద్వారా దిగువన ఉన్న సుమారు 800 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు వచ్చేదన్నారు. పది సంవత్సరాల క్రితం జఫర్‌గడ్ మండలానికి చెందిన కొందరు రైతులు వారికి సాగునీరు రావడంలేదనే కోపంతో కుడితూమును ధ్వంసం చేయగా, అప్పటి నుంచి తూము ద్వారా నీళ్లు అకేరు వాగులో పడిపోతున్నాయని తెలిపారు.

గత పదేళ్లుగా తూముకు మరమ్మతుల చేయక పంటలను పడించుకోలేక పోయామని తెలి పారు. సమస్యను ఇటీవల ఎమ్మెల్యే కడియం దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన స్పందించి నీటి పారుదల శాఖ నుంచి రూ 4లక్షల నిధులు మంజూరు చేయించి తూముకు మరమ్మతులు చేయించడంతో పాటు సంప్‌ను నిర్మించారని తెలిపారు. మరమ్మతులు పూర్తి కావడంతో బుధవారం నుంచి రైతులకు సాగునీరు వస్తుందన్నారు. ముదిరాజ్ మహసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులు చుక్క చేరాలు, నీల రాజు, పొన్నం రాజయ్య, నీరటి నర్సయ్య, మాతంగి వెంకటయ్య, దారం మల్లయ్య, గోనెల రాజు, యాదగిరి, రవి, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దశమంతరెడ్డి

జఫర్‌గడ్, సెప్టెంబరు 18 : పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం జఫర్‌గడ్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దశమంతరెడ్డి సభ్యత్వ నమోదు, పార్టీ కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. సభ్యత్వ నమోదు సంఖ్యను పెంచాలన్నారు. కేంద్రంలోని ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. పార్టీ పటిష్టవంతానికి సమిష్టిగా పాటుపడాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి కడమంచి రమేశ్, జిల్లా కన్వీనర్ కొంత శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్, నియోజకవర్గ కన్వీనర్‌లు ఐలోని అంజిరెడ్డి, సంపత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, జిల్లా, మండల నేతలు వలీపాషా, తిరుపతి, చిరబోయిన కవిత పాల్గొన్నారు.

అందరూ పరిశుభ్రతను పాటించాలి: ఎంపీడీవో



కొడవటూరు లో చిన్నారుల బరువు తూకం వేస్తున్న దృశ్యం

జఫర్‌గడ్, సెప్టెంబరు 18: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని జఫర్‌గడ్ ఎంపీడీవో సుమన్ కోరారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం మండలంలోని కూనూరు, రఘునాథ్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్న ప్రాసనతో పాటు విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో సుమన్ మాట్లాడుతూ స్వచ్ఛత, పరిశుభ్రతను పాటించడం వల్ల ఆరోగ్యాలు పదిలంగా ఉంటాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత పంచాయతీ కార్యదర్శులు, హెచ్ఎం సదాశివరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పాల్గొన్నారు.

ఉప్పుగల్లులో పోషణమాసం..

మండలంలోని ఉప్పుగల్లులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్న ప్రాసన నిర్వహించి, పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి సమ్మయ్య, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, సుజాత, రజిత, కవిత, అనిత, చిత్రాదేవి, శ్రీవాణి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

హాజరుశాతం పెంచాలి

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతం పెంచాలని సీడీపీవో రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని కొడవటూరులో అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణమాసం ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వం బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. ఇందుకు అనుగునంగా టీచర్లు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు అందించేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోనే భోజనాలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కథలు చెప్పించటం, పాటలు పాడించటం లాంటి కార్యక్రమాలు చేపటారు. ఆర్‌బీఎస్‌కే వైద్యటీం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రూపచైతన్య, సూపర్‌వైజర్లు, టీచర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కోమల్లలో అన్నప్రాశన

రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఆరు నెలలు నిండిన చిన్నారులకు బుధవారం అంగన్‌వాడీ టీచర్లు వారి తల్లుల సమక్షంలో అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ చిన్నారులకు ఆరు నెలలు పూర్తిగా నిండే వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆరు నెలలు పూర్తిగా నిండిన పిల్లలకు అనుబంధ ఆహారాన్ని ఇవ్వడం ప్రారంభించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి త్రివేణి, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, సుప్రియ, ఫాతిమాబేగం తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి అభిషేకం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 18: మండలంలోని తాటికొండలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం కనకదుర్గ అమ్మవారికి పంచామృత అభిషేకాన్ని అర్చకుడు వరుణాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు పండుగ రాజేశ్వర్, బుచ్చయ్య, పర్శ రాజు, రాజేందర్, రాములు, కనకయ్య, వికాస్, కొమురయ్య, రచ్చ శ్రీనివాస్, వీరస్వామి, నారబో యిన గోపాల్, పవన్‌కల్యాణ్, నితిన్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అవగాహన సదస్సు

జనగామ రూరల్, సెప్టెంబరు 18: ఈనెల 23న జనగామలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ జనగామ సబ్ డివిజనల్ అధికారి చంద్రగిరి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈనెల 23న జిల్లా కేంద్రంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ అవరణలో మొబైల్ రేడియేషన్, సైబర్ నేరాలు, మోసపూరిత కాల్స్ పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తునట్లు తెలిపారు. వినియోగదారుల నుంచి ఇతర సలహాలు, సూచనలను స్వీకరిస్తామని, సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

హద్దు రాళ్లను తొలగించిన అధికారులు



వెంచర్ హద్దురాళ్లు తొలగిస్తున్న అధికారులు

దేవరుప్పుల, సెప్టెంబరు 18: మండలకేంద్రంలోని చిన్నమడూరులో సర్వేనెంబర్ 15, 18. 26లలో సుమారు 35ఎకరాలలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో బుధవారం జనగామ ఆర్డీఓ కొమురయ్య సమక్షంలో అధికారులు హద్దురాళ్లను తొలగించారు. డీటీపీసీ, జీపీ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫాత్‌వే పార్టేషన్ స్టోన్స్‌ను తొలగించారు. ఈసందర్భంగా ఆర్డీఓ కొమురయ్య మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా వెంచర్లు ఏర్పాటు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హస్సేన్ ఎంపీఓ సురేష్‌కుమార్, ఎస్సై సృజన్‌కుమార్, ఆర్ఐలు రాజు, ఆంధ్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

రఘునాథపల్లి, సెప్టెంబరు 18:రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఆదేశాల మేరకు మండలంలోని 36 గ్రామ పంచాయతీలతో పాటు వాటి పరిధిలోని 320 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించడానికి ఆయా గ్రామ పంచాయతీలలో ఓటర్ల జాబితాను విడుదల చేశామని ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ, తదితర అంశాలపై చర్చించడానికి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 19(గురువారం)న ఉదయం 11 గంటలకు 36 గ్రామ పంచాయతీల పరిధిలోని వివిధ రాజకీ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి రాజకీయ పార్టీల నాయకులు సకాలంలో హాజరై సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు.

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

చిలుపూర్, సెప్టెంబరు 18 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఉచితంగా వైద్యారోగ్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్న -వెంకటేశ్ అన్నారు. బుధవారం మండలంలోని నష్కల్‌లో వరంగల్‌కు చెందిన వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ - బాలాజీ డెంటల్ హాస్పిటల్ యాజమాన్యం సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య, ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లు రాజేశ్, డాక్టర్ పావని నేతృత్వంలోని ప్రత్యేక వైద్యుల బృందం 200ల మందికి రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు పాశం శిరీష -సురేశ్, మోడెం స్వామి, మాజీ ఉప సర్పంచ్ చిర్ర రాజు, చిర్ర శంకర్, మోడెం భిక్షపతి, పుల్యాల రాజిరెడ్డి, దేవస్థానం చైర్మన్ కోరుకొప్పుల హరికిషన్, రంగు సురేశ్, మోడెం వేమన, డాక్టర్లు శరవన, ఈ. వెంకటేశ్వర్లు, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

జఫర్‌గడ్, సెప్టెంబరు 18: ఓ యువకుడికి అతిగా మద్యం తాగించిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైన ఘటన మండలంలో బుధవారం జరిగింది. జఫర్‌గడ్ ఎస్ఐ బానోత్ రామ్‌చరణ్‌నాయక్ తెలిపిన ప్రకారం తిమ్మాపూర్‌కు చెందిన బక్కం వరుణ్ సందీప్ అనే యువకుడు ఈనెల 16న రాత్రి గ్రామంలో జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పెంతల మహేశ్, రాజ్‌కుమార్ అనే వ్యక్తులు కూల్‌డ్రింక్‌లో మద్యం పోసి వరుణ్ సందీప్‌కు తాగించారు. దీంతో అతడు వాంతులు చేసుకుని కింద పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడిని అదే రోజు చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో మద్యం తాగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితుడి తండ్రి కరుణాకర్ ఫిర్యాదు చేయగా, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మాజీ సర్పంచ్ ఇల్లందుల రాజేందర్‌ను పరామర్శిస్తున్న రాజయ్య, ఆరూరి రమేష్

చిలుపూర్, సెప్టెంబరు 18 : మండలంలోని చిన్నపెండ్యాలలో అనారోగ్యంతో ఆరూరి రిక్కీ (22) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ రాజయ్య, ఆరూరి రమేష్ బుధవారం రిక్కీ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని తండ్రి, మాజీ సర్పంచ్ ఇల్లందుల రాజేందర్‌తో పాటు, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారపాక రవి, నాయకులు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, జనగామ యాదగిరి, బత్తుల రాజన్‌బాబు, ఆకుల కుమార్, గణేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జఫర్‌గడ్, సెప్టెంబరు 18: మండలంలోని ఓబులాపూర్‌లో బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన ఎంపెల్లి కృష్ణమూర్తి మృతదేహాన్ని జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. పేద బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

బచ్చన్నపేట, సెప్టెంబరు 18: స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో పలువురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. అద్భుతమైన డ్రాయింగ్ వేసిన విద్యార్థులను స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందామంటూ ర్యాలీలు నిర్వహించారు.